ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..




'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | సోమవారం | 06.07.2026 | సంపుటి : 2 | సంచిక : 05 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్




**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## పదవి లేకున్నా కాంగ్రెస్ కోసం పని చేస్తా

### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్: 'నాకు పదవులిచ్చినా, ఇవ్వకున్నా రాహుల్‌గాంధీ నాయకత్వంలో పని చేస్తా, నేను కాంగ్రెస్ పార్టీకి దూరంగా లేను' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్‌లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ, ఫీనిక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో

-మిగతా 2 లో..





## ముంబయిని ముంచెత్తిన కుండపోత

### భారీ వర్షాలతో జలమయమైన నగరం.. రెడ్ అలర్ట్ జారీ

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం 05

## మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో రేవంత్ సర్కారు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 5 : హైడ్రా పేద ముస్లింల ఇళ్లు కూల్చివేస్తున్నప్పుడు కాంగ్రెస్, మజ్లిస్‌లు నోరెత్తలేదని ఇప్పుడు ఒవైసీ సోదరుల ఆస్తులను కాపాడే విషయంలో మాత్రం ఈ రెండు పార్టీలు ఒకే ఆలోచనతో వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. "హైడ్రా పేద ముస్లింల

-మిగతా 2 లో..



# మెట్రోపై జాప్యం తగదు

### జూన్ 24 నిర్ణయాలను కేంద్రం అమలు చేయాలి

### ఎస్‌బీఐ క్యాప్స్‌కు వెంటనే బాధ్యతలు అప్పగించాలి

### కేంద్ర మంత్రులు ఖట్టర్, కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ లేఖ

హైదరాబాద్ మెట్రో రైలు తొలి దశ, రెండో దశ ప్రాజెక్టులకి సంబంధించి కీలకమైన నిర్ణయాల అమలులో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుండడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ఆయన లేఖలు రాశారు. హైదరాబాద్ మెట్రో తొలి దశ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి, రెండో దశ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం అత్యంత కీలకమని ఈ లేఖల్లో ఆయన పేర్కొన్నారు. ఈ రెండు అంశాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయన్నారు.



హైదరాబాద్, జూలై 5 : కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో గత జూన్ 24న నిర్వహించిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని ఆయన కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. మెట్రో తొలి దశ ప్రాజెక్టు విలువను అంచనా వేయడం, దాని ఆర్థికస్థితిని పరిశీలించడంతోపాటు రెండో దశ ప్రాజెక్టుకి ఆర్థిక వనరులను సమకూర్చుకునే మార్గాలను అన్వేషించే బాధ్యతలను ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్(ఎస్‌బీఐ క్యాప్స్) సంస్థకు బాధ్యతలను అప్పగించాలని ఆ సమావేశంలో నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నిర్ణయం జరిగి చాలా రోజులు గడిచినా, ఇప్పటి వరకు ఎస్‌బీఐ క్యాప్స్‌కు బాధ్యతలు అప్పగించలేదని, అలాగే ఈ ప్రక్రియకు సంబంధించిన నియమనిబంధనలు సైతం ఖరారు చేయలేదని ప్రస్తావించారు. ఈ జాప్యంతో మెట్రో రైలు తొలి దశ ప్రాజెక్టు నిర్వహణలో

మిగతా 2 లో



# మాపై కోపంతో రైతులను గోస పెడుతున్నారు

### కాళేశ్వరాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే.. వారంలో నీళ్లందిస్తాం

### కళ్ల ముందే లక్ష క్యూసెక్కులు సముద్రం పాలు

### మాపై కోపంతో రైతులను గోస పెడుతున్నరు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

### ఆంక్షల మధ్య సాగిన కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటన

కాళేశ్వరం, జూలై 5 : కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ రైతులను గోస పెడుతోంది. బ్యారేజీతో సంబంధం లేకుండానే కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయొచ్చు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకాకపోతే, వారంపాటు కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగిస్తే అన్నదాతలకు నీరందిస్తాం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్‌ను ఆయనతోపాటు భారాస నేతల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కన్నెపల్లి పంపుహౌస్ వద్ద విలేకరులతో కేటీఆర్ మాట్లాడుతూ... "సూపర్ ఎల్‌నినో, కరవు పరిస్థితులతో తెలంగాణ రైతుల బాధలను చూడలేక కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చా. కన్నెపల్లి పంపుహౌస్ వద్ద లక్ష క్యూసెక్కుల గోదావరి నీరు దిగువకు వృథాగా వెళ్లి సముద్రంలో కలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు దెబ్బతిని 31 నెలలు గడుస్తున్నా... ఇంతవరకు మరమ్మతులు

మిగతా 2 లో

## నాసిరకం నిర్మాణంతో మేడిగడ్డ కుంగింది

### కాళేశ్వరం కూల్చేసి.. పంపులు నడపాలంటారా

### దెబ్బతిన్న సుందిళ్ల, అన్నారం నింపొద్దని ఎన్డీఎస్ఏనే చెప్పింది

### బ్యారేజీలు నింపితే భద్రాచలం కొట్టుకుపోతుంది

### ఎన్డీఎస్ఏ కన్నా కేటీఆర్‌కు ఎక్కువ తెలివేమీ లేదు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం

'బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల కక్కుర్తి, స్వార్థంతో కాళేశ్వరం ప్రాజెక్టును నాసిరకంగా నిర్మించారు. వారి పరిపాలనలోనే ప్రాజెక్టుకు గుండెకాయ వంటి మేడిగడ్డ బ్యారేజీ కుంగింది. అన్నారం, సుందిళ్ల పనికిరాకుండా పోయాయి. పంపులు నడిపి బ్యారేజీలు నింపాలంటూ ఇప్పుడు పెద్దపెద్ద మాటలతో అసత్య ప్రచారం చేస్తూ బయలుదేరారు' అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సచివాలయంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, సారంగాల నిపుణుడు పరీక్షిత్ మెహ్రా, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాస్, ఈఎన్సీ రమేశ్‌బాబుతో కలిసి మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు.



హైదరాబాద్, జూలై 5 : "రూ.38 వేల కోట్లతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే తుమ్మిడిహెట్టి నుంచి ఎత్తిపోసుకొని నిర్మించాల్సిన ప్రాణహిత- చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని మార్చి నాటి సీఎం కేసీఆర్ పెద్ద తప్పు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే గ్రావిటీ ద్వారా ఉత్తర తెలంగాణకు నీళ్లు అందేవి. కానీ రాజకీయ ప్రయోజనాలతో, స్వార్థంతో కమీషన్ల కోసం ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చి ప్రజలకు ద్రోహం చేశారు. వారిపాలనలోనే డిజైన్ చేసి, నిర్మించిన బ్యారేజీలు 2023 అక్టోబరులో

-మిగతా 2 లో..



## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

### కమీషన్ల కోసం వారు కాళేశ్వరం నిర్మిస్తే.. పేదలకు మేం ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం

### రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, జూలై 5 : బీఆర్ఎస్ వాళ్లు కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు కడుతోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టంచేశారు. పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన భారాస నాయకులకు... పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో రూ.14.5 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సత్తుపల్లి మండలం యాతాలకుంటలో హైలెవల్ వంతెనను ప్రారంభించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.2 కోట్ల నగరాభివృద్ధి నిధులతో అవుట్‌డోర్ ప్లే ఫీల్డ్,

-మిగతా 2 లో..

## 'సర్'ను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలి

### డివిజన్ స్థాయి నాయకులు నిరంతరం పర్యవేక్షించాలి

### కాంగ్రెస్ శ్రేణులకు భట్టి దిశానిర్దేశం

హైదరాబాద్, జూలై 5 : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం ప్రజాభవన్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన కీలక సమావేశానికి హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..

-మిగతా 2 లో..





# మెట్రోపై జాప్యం తగదు

(మొదటిపేజీ తరువాయి)

అనిశ్చితి నెలకొనడమే కాకుండా, రెండో దశ నిర్మాణంలో ఆలస్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్‌కు బాధ్యతలను తక్షణమే అప్పగించేలా చూడాలని, తద్వారా మెట్రో విస్తరణ పనులు వేగంగా ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రం చర్యలు తీసుకునేలా మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని సూచించారు.



# అతివేగానికి.. నలుగురి దుర్మరణం

- కారును ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు
- విజయవాడ-హైదరాబాద్ హైవేపై ఘోర ప్రమాదం

**చిట్యాల:** విజయవాడ--హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మధురానగర్(యూసుఫ్‌గూడ)లో నివాసముంటున్న మలిరెడ్డి వీర వెంకట నాగ వరప్రసాద్‌బాబు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో ఉద్యోగం చేస్తున్నాడు. అతడి స్వస్థలం ఏపీలోని కాకినాడ కాగా.. ఉద్యోగ రీత్యా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. వరప్రసాద్‌బాబు, అతడి భార్య విజయలక్ష్మి(40), కుమార్తె శ్రియ(17), కుమారుడు ప్రభవ్(12)తోపాటు వారికి తెలిసిన వ్యక్తి అయిన హైదరాబాద్‌లోని గుండ్లపోచంపల్లిలో నివాసముంటున్న సినీ ఎడిటర్ కట్టా శ్రీకర్ ప్రసాద్(62)తో కలిసి తమ కూతు రుకు మెరుగైన వైద్యచికిత్స కోసం శనివారం ఉదయం చెన్నై వెళ్లారు. తిరిగి శనివారం రాత్రి చెన్నై నుంచి కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో ఆదివారం తెల్లవారుజామున చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో విజయవాడ--హైదరాబాద్ హైవేపై గల యూటర్న్ వద్దకు రాగానే అతివేగంగా వస్తున్న ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనుక సీట్లో కూర్చున్న విజయలక్ష్మి, శ్రియ, ప్రభవ్‌తో పాటు ముందు కూర్చున్న కట్టా శ్రీకర్ ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందారు. కారు డ్రైవింగ్ చేస్తున్న వరప్రసాద్‌బాబుకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్, తన సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వరప్రసాద్‌బాబును చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పరిశీలించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

# పదవి లేకున్నా కాంగ్రెస్ కోసం పని చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, కార్యకర్తలను కాపాడుకునేందుకు కృషి చేస్తున్నాను. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే ఏం చేయాలి.. ఇచ్చిన హామీలను ఎంత వరకు నెరవేర్చాం.. ప్రజల మనసులను గెల్చుకునేందుకు ఇంకేం చేయాలి.. ప్రభుత్వం నుంచి వాళ్లేం ఆశిస్తున్నారు అని నిత్యం ఆలోచిస్తున్నాను. మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలు చాలా మంది ఉన్నారు. వాళ్లకు అన్యాయం జరుగకూడదనే తప్పనిసరి పరిస్థితుల్లో యాదగిరిగుట్ట దేవస్థాన కమిటీ గురించి మాట్లాడాల్సి వచ్చింది. అది పార్టీకి వ్యతిరేకం చేయాలనో, ముఖ్యమంత్రికి వ్యతిరేకమో, ప్రభుత్వానికి చెడ్డ పేరు రావాలనో అలా మాట్లాడలేదు. నేను ఇటీవల రాహుల్‌గాంధీని కలిశాను. ఆయన నాకిచ్చినంత సమయం తెలంగాణ రాష్ట్రంలో ఇంకెవ్వరికీ ఇచ్చి ఉండరు. పార్టీ, ప్రభుత్వ పనితీరుపై, నా కుటుంబ నేపథ్యం గురించి అడిగారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం ఎలా.. ఏం చేస్తే బాగుంటుందని అడిగారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలనే లక్ష్యంతో నేను పని చేస్తా" అని అన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

(మొదటిపేజీ తరువాయి)

రన్నింగ్ ట్రాక్, టెన్నిస్, వాలీబాల్ కోర్టు తదితర నిర్మాణాలకు ఎమ్మెల్యే మట్టా రాగమయి, కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి శంకుస్థాపన చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో, అనంతరం ఓ ప్రకటనలో ఆయన భారాసపై విమర్శలు గుప్పించారు. "కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకుని, నాణ్యతలేని నిర్మాణాలు చేసి... రాష్ట్ర ప్రజలపై భారాన్ని మోపిన భారాస నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదు. కన్నెపల్లి పర్యటనలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నమే. కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులు కడితేనే కమీషన్లు వస్తాయనే ఆలోచనతో నాటి పాలకులు పేదల గృహ అవసరాన్ని విస్మరించారు. మీరు నాసిరకం నిర్మాణాలు చేసి కూల్చేసి ఇప్పుడు వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం బాగు చేయడం లేదని విమర్శించడం హాస్యాస్పదం. వాస్తవాలను దాచిపెట్టి అబద్ధాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వారి ప్రయత్నాలు ఫలించవు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి కల్పన వంటి సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా ప్రభుత్వం అమలు చేస్తోంది" అని మంత్రి పేర్కొన్నారు.

# నాసిరకం నిర్మాణంతో మేడిగడ్డ కుంగింది

(మొదటిపేజీ తరువాయి)




పనికిరాకుండా పోయాయి. బ్యారేజీల్లో నాణ్యత, నిర్వహణ లేదని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) వారి హయాంలోనే ప్రాథమిక నివేదిక ఇచ్చింది. గేట్లు తెరిచి ఉంచాలని, భూ భౌతిక పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే మరమ్మతులు చేయాలని ఎన్డీఎస్ఏ చెప్పడంతో మా ప్రభుత్వం ఆ సూచనలు పాటిస్తోంది. మేడిగడ్డ సమీపంలోని కన్నెపల్లి పంపుహౌస్ ప్రారంభించి నీటిని ఎత్తిపోసుకోవచ్చని భారాస నాయకుడు కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇది రాజకీయాలకు సంబంధించిన అంశం కాదు. మరమ్మతులకు ముందే బ్యారేజీలు నింపితే ప్రజల ప్రాణాలకు ప్రమాదం. మేడిగడ్డ దిగువన అనేక గ్రామాలతోపాటు భద్రాచలం పట్టణం కొట్టుకుపోతుంది. బ్యారేజీల గేట్లు తెరిచే ఉంచాలన్న ఎన్డీఎస్ఏ కన్నా కేటీఆర్‌కు తెలివి ఎక్కువేమీ లేదు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రభుత్వం ఎలాంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోబోదు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులకు రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి కొత్తగా ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వలేదు. గుత్తేదారుల నుంచి లాభాన్ని ఆశించి ప్రాజెక్టులు అప్పగించారు. 2022 నాటి కాగ్ లెక్కల ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా రూ.1.27 లక్షల కోట్లకు చేరింది. ఇప్పుడు రూ.1.50 లక్షల కోట్లు అవుతుంది. ఆ నాడే రూ.38 వేల కోట్లతో ప్రాణహిత-చేవెళ్ల పూర్తి చేసి ఉంటే ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితి వచ్చి ఉండేదా? కాళేశ్వరం లేకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రికార్డు స్థాయిలో పంటలు పండాయి. ఈ ప్రాజెక్టుపై మాకేమీ రాజకీయ ఉద్దేశాలు లేవు. డిజైన్లు పూర్తికాగానే పునరుద్ధరణ పనులు ప్రారంభించి వచ్చే వానాకాలం నాటికి బ్యారేజీలను వినియోగంలోకి తెస్తాం. మూడు బ్యారేజీలకు డయాఫ్రం వాల్ నిర్మించాల్సి రావచ్చు' అని మంత్రి పేర్కొన్నారు. నీటిపారుదల సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాస్.. పంపు హౌస్‌లు నడపాలంటే బ్యారేజీల్లో నీటి మట్టాన్ని పెంచాల్సి ఉంటుం దని, ఎన్డీఎస్ఏ గేట్లు తెరిచే ఉంచాలని హెచ్చరించిన నేపథ్యంలో ఎత్తిపోతలు సాధ్యం కాదని పీపీటీ ప్రజంటేషన్ ద్వారా విశ్లేషించారు.

# మాపై కోపంతో రైతులను గోస పెడుతున్నరు

(మొదటిపేజీ తరువాయి)



చేపట్టలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగిరాకపోతే భారాస అధినేత కేసీఆర్‌తో చర్చించి, 50 వేల మందితో కాళేశ్వరాన్ని ముట్టడించి, మోటార్లు ఆన్‌చేసి నీటిని మేమే ఎత్తిపోస్తాం. మంథనితోపాటు హైదరాబాద్‌లో తాగడానికి నీళ్లు లేక అలమటిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రోజూ రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసి కరవు పరిస్థితులను అధిగమించొచ్చు. నా చిన్నప్పటి నుంచి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాగుతూనే ఉంది. కేసీఆర్ జలదౌత్యంతో మహారాష్ట్రను ఒప్పించి రికార్డు సమయంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. నా పర్యటనను అడుగడుగునా అడ్డుకున్నారు. మేమేమైనా దాడి చేయబోతున్నామా?" అని ప్రశ్నించారు. అంతకుముందు కేటీఆర్‌తోపాటు భారాస నేతల బృందం కన్నెపల్లి పంప్‌హౌస్ ఫోర్ బే, అప్రోచ్ ఛానల్ వద్ద గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు జీవన్‌రెడ్డి, రాజయ్య, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమెల్యేలు పుట్ట మధు, బాల్క సుమన్, నాయకులు పాల్గొన్నారు. కన్నెపల్లి పంపుహౌస్‌ను పరిశీలించడానికి హైదరాబాద్ నుంచి పార్టీ శ్రేణులతో కలిసి బయలుదేరిన కేటీఆర్‌ను జనగామ జిల్లా పెంబర్తి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. కేటీఆర్ పర్యటనలో మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని, పెద్దఎత్తున వాహనాలను ముందుకు వెళ్లేందుకు అనుమతించమని పోలీసులు స్పష్టంచేశారు. ఈ క్రమంలో కేటీఆర్‌తోపాటు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పోలీసులతో వాగ్వాదం చేశారు. ఒక దశలో తోపులాట జరిగింది. చివరకు కేటీఆర్ వాహన శ్రేణిని పోలీసులు అనుమతించడంతో వివాదం సద్దుమణి గింది. తర్వాత రఘునాథపల్లి మండలం కోమాళ్ల టోల్‌గేట్ వద్ద కేటీఆర్ కాన్వాయ్‌కి ముందు ముఖ్యనేతలతో పాటు వందల సంఖ్యలో పార్టీ శ్రేణుల వాహనాలు రావడంతో పోలీసులు వాటిని నిలువరించారు. పార్టీ నాయకులు జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్‌ను దీనిపై ప్రశ్నించగా ముఖ్య నేతలను పంపిస్తామన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దకు వెళ్లేందుకు భారాస శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆ సమయానికి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి చేరుకుని బారికేడ్లను తొలగించారు. పోలీసులు నియంత్రించినా అదుపుకాలేదు.

# బరాజ్‌ల్లో నీరు నిల్వ చేస్తే ప్రమాదమే

- మేడిగడ్డ కొట్టుకుపోతుందని హెచ్చరించిన ఎన్డీఎస్ఏ
- అందుకే వరద నీటిని వదిలేస్తున్నాం మంత్రి శ్రీధర్‌బాబు



**భూపాలపల్లి, జూలై 5 :** మేడిగడ్డలో పిల్లర్ కుంగిపోయింది.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో సీపేజీ లీకేజీ లోపాలున్నాయి, ఇటువంటి సమయంలో వరద నీటిని నిల్వ చేస్తే భారీ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. గత పాలకులే ఇంజనీర్లుగా వ్యవహరించి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం మూలంగా మేడిగడ్డ బరాజ్ వద్ద బ్లాక్--7లో 20 పిల్లర్ పూర్తిగా కుంగిపోయిందన్నారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) అధికారులు బరాజ్‌లను సందర్శించి వరద నీటిని నిల్వ చేస్తే మేడిగడ్డ కొట్టుకుపోతుందని చెప్పారని పేర్కొన్నారు. ఫలితంగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం కలిగించడమే బీఆర్ఎస్ నాయకుల ఉద్దేశమా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులకు అన్నీ తెలిసినా, తప్పు చేశామని సిగ్గు పడకుండా, కాంగ్రెస్ పార్టీని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాము ఎన్‌డీఎస్ఏ సూచనలను అమలు చేస్తున్నామన్నారు. బరాజ్‌లను మరమ్మతు చేశాకే నీటిని నిల్వ చేస్తామని, అప్పటి వరకు వరద నీటిని వదిలేస్తామని వెల్లడించారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల రైతులు ఏం పాపం చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టు జలాలు అందకుండా చేశారని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు.

# రైలు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

**ఏలూరు, జూలై 5 (ఆంధ్ర మనం):** ఏలూరు జిల్లా చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి విషాదం చోటుచేసుకుంది. రైల్వే పట్టాలు దాటుతున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని ప్రత్యేక రైలు ఢీకొనడంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రాత్రి సుమారు 9 గంటల సమయంలో ప్లాట్‌ఫారం సమీపంలో పట్టాలు దాటుతుండగా విశాఖపట్నం వైపు వెళ్తున్న ప్రత్యేక రైలు వారిని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను తాడేపల్లిగూడెంకు చెందిన షేక్ చాంద్ బాషా (50), ఆయన భార్య షేక్ హసీనా (45), కుమార్తెలు షేక్ షర్మిల (23), షేక్ సమీరా (20)గా రైల్వే అధికారులు గుర్తించారు. షర్మిల ఎంబీఏ చదువుతుండగా, చాంద్ బాషా దంపతులు తాడేపల్లిగూడెంలో ఆప్టికల్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి స్వస్థలం గుడివాడ కాగా, సుమారు 25 ఏళ్ల క్రితం తాడేపల్లిగూడెంలో స్థిరపడ్డారు. గత మూడేళ్లుగా పట్టణంలోని మామిడితోట ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కుటుంబం కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నట్లు కూడా సమాచారం. ప్రమాదం జరిగిన రోజు సాయంత్రం కుటుంబ సభ్యులంతా రెండు మోటార్‌సైకిళ్లపై ఇంటి నుంచి బయలుదేరినట్లు పొరుగువారు తెలిపారు. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందా, లేక ఇతర కారణాలున్నాయా అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.



# 'సర్'ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

"ఓటరు జాబితాలో అన్-మ్యాపింగ్ పేర్లు, సాంకేతిక లోపాలు, ఇంటి పేర్ల మార్పులు, అక్షర దోషాలు లేకుండా బీఎల్ఏలతో కలిసి డివిజన్ స్థాయి నాయకులు నిరంతరం పర్యవేక్షించాలి. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో ఉన్న సానుకూలతను ఓటు బ్యాంకుగా మార్చుకోవాలి" అని భట్టి దిశానిర్దేశం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ మాట్లాడుతూ.. అన్-మ్యాపింగ్‌లో ఉన్న పేర్లు 50 శాతానికి పైగా ఉండటం ఆందోళనకరమని, వీటిని బీఎల్ఏలతో కలిసి సరిచూసుకోవాలన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో రేవంత్ సర్కారు

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్లను కూల్చింది. ఆ సమయంలో వారి తరఫున మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్లేందుకు కాంగ్రెస్ వెనకాడటం లేదు. పక్షపాత పాలనకు హైడ్రా ఓ ఉదాహరణ. సామాన్యుల విషయంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం... సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం ఎందుకు మౌనంగా ఉంటోంది? హైకోర్టు పలుమార్లు ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా సర్కారు తీరులో మార్పులేదు. ముస్లిం సమాజంపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమలేదు. తమ మిత్రుడైన ఒవైసీకి ఇబ్బంది కలగకూడదన్నట్లుగా, మజ్లిస్ ప్రయోజనాలకు కాపాడేలా రేవంత్ సర్కారు వ్యవహరిస్తోంది" అని కిషన్‌రెడ్డి అన్నారు.



# బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం

**విశాఖపట్నం (ఏయూ ప్రాంగణం):** ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఒడిశాలోని బాలాసోర్‌కు 40 కి.మీ, చాంద్‌బలికి 50 కి.మీ, పశ్చిమ బెంగాల్‌లోని దిఘాకు 70 కి.మీ. దూరంలో ఉందని తెలిపారు. పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రాబోయే 12 గంటల్లో చాంద్‌బలి-దిఘా మధ్య బాలసోర్ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత 24 గంటల్లో అది ఉత్తర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే వీలుందని తెలిపారు. దీని ప్రభావంతో సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని సూచించారు.

## భర్తను చంపి బాత్రూమ్‌లో పూడ్చిపెట్టిన భార్య..

**45 రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన దారుణం**

**నిద్రమాత్రలు ఇచ్చి హత్య చేసినట్లు నిందితురాలి ఒప్పుకోలు**

**మరెవరైనా సహకరించారా? అన్ని కోణాల్లో దర్యాప్తు**

**ఆగ్రా, జూలై 5:** ఉత్తర్రప్రదేశ్‌లోని ఆగ్రాలో దారుణ హత్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భర్త కనిపించడం లేదంటూ నాటకం ఆడిన ఓ మహిళ, అతడిని హత్య చేసి ఇంటి బాత్రూమ్‌లోనే పూడ్చిపెట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాదాపు 45 రోజుల తర్వాత ఈ ఘటన బయటపడగా, మృతుడిని సురేంద్ర శర్మగా గుర్తించారు. నిందితురాలు రూబీ శర్మను పోలీసులు అరెస్ట్ చేశారు. దర్యాప్తులో రూబీ శర్మ సంచలన విషయాలు వెల్లడించింది. భర్త ఆహారంలో 15 నుంచి 20 నిద్రమాత్రలు కలిపి ఇచ్చినట్లు, మత్తులోకి వెళ్లిన తర్వాత హత్య చేసి బాత్రూమ్ టైల్స్ కింద మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు అంగీకరించింది. అనంతరం భర్త కనిపించడం లేదంటూ పొరుగువారి ముందు ఏడుస్తూ అందరినీ నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు.

### ముందుగానే పక్కా ప్రణాళిక

హత్య జరిగిన రోజే ఉదయం తన బావ అనిల్ శర్మకు ఫోన్ చేసి, “అమ్మను, పిల్లలను తీసుకెళ్లండి.. కానీ ఇంట్లోకి మాత్రం రావద్దు” అని రూబీ చెప్పినట్లు విచారణలో వెల్లడైంది. అప్పట్లో ఈ విషయాన్ని ఎవరూ అనుమానించకపోయినా, ఇప్పుడు హత్యతో దానికి సంబంధం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మే 26న భర్త కనిపించడం లేదంటూ రూబీ, ఆమె బావ కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రూబీ ప్రవర్తనపై అనుమానం వచ్చిన సురేంద్ర సోదరుడు అనిల్ శర్మ బ్యాంకు లావాదేవీలు, ఇతర వివరాలను పరిశీలించాడు.

### దర్యాప్తు కొనసాగుతోంది

జూలై 3న రూబీ స్వయంగా అనిల్ శర్మకు ఫోన్ చేసి, సురేంద్రను బాత్రూమ్‌లో పూడ్చిపెట్టినట్లు చెప్పినట్లు సమాచారం. ఈ హత్యలో మరెవరైనా సహకరించారా, గుంత ఎవరు తవ్వారు, మృతదేహాన్ని పూడ్చిపెట్టడంలో ఇంకెవరైనా పాత్ర ఉందా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




## హర్మూజ్‌లో సేవా రుసుం..

**మిత్ర దేశాలకు స్పెషల్ ట్రీట్‌మెంట్: ఇరాన్**

**ఇరాన్ :** ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో కొత్త టోల్ విధానాన్ని అమలు చేయడానికి ఇరాన్ చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దుల్ రెజా రహ్మనీ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ తమ ప్రాదేశిక జలాల్లో భాగంగా ఉన్నందున.. జలసంధిలో సేవా రుసుం వసూలు చేస్తామని పేర్కొన్నారు. ఇవి టోల్ కిందకు రావన్నారు. ఈ విషయంపై ఒమన్‌తో చర్చలు జరుపుతున్నామన్నారు. కష్టసమయంలో తమకు సహకారం అందించిన మిత్ర దేశాలకు సేవా రుసుం విషయంలో ప్రత్యేక ప్రాధాన్యాన్ని కల్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హర్మూజ్‌లో ప్రయాణ భద్రతకు హామీ ఇవ్వడం, నౌకల రాకపోకలను పర్యవేక్షించడం, భారీ సంఖ్యలో నౌకల వల్ల కలిగే పర్యావరణ పరిణామాలను ఎదుర్కోవడం వంటివాటిని ఒమన్ సహకారంతో ఇకపై తాము పర్యవేక్షిస్తామని అబ్దుల్ రెజా వెల్లడించారు. కాగా హర్మూజ్‌లో విధించే సేవా రుసుంపై మిత్రదేశాలకు ప్రత్యేక రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలని టెహ్రాన్ యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. హర్మూజ్ భద్రతను ఇకపై ఒమన్‌తో కలసి తాము చూసుకుంటామని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ గరీబాబాది పేర్కొన్నారు. ఇతర దేశాలు సైనిక విన్యాసాలు చేపట్టడానికి ఈ జలసంధి రంగస్థలం కాదని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ నిర్దేశించిన మార్గంలో కాకుండా.. ఒమన్ తీరం వెంబడి ప్రయాణించడానికి ప్రయత్నించిన ఎనిమిది నౌకలను అక్కడి అధికారులు వెనక్కి పంపినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి.

## మూడోసారి అధ్యక్షుడిని

**: ట్రంప్ నర్మగర్భ వ్యాఖ్యలు**



**వాషింగ్టన్ :** వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ తరచూ వార్తల్లో నిలిచే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని శనివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. అధ్యక్ష భాధ్యతలు నిర్వర్తిస్తుండటం ఇది మూడోసారి అని చెప్పుకొన్నారు. నిజానికి ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం రెండోసారి. అయినప్పటికీ.. 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ తన విజయాన్ని దోచుకున్నారని ఆయన పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. దానిని కూడా తన ఖాతాలో వేసుకోని మూడోసారి అధ్యక్షుడిని అని అన్నారు. అంతలోనే నవ్వుకుంటూ వివాదాస్పద అంశాల జోలికి పోవాలనుకోవట్లేదంటూ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా అమెరికా ఎదిగిందంటే.. అది అనుకోకుండా జరిగిందేమీ కాదని ట్రంప్ అన్నారు. మొదటిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు దేశ సైన్యాన్ని పునర్నిర్మించినట్లు చెప్పారు. దేశ సైనిక సామర్థ్యాలను పెంపొందించడానికి తాను చేసిన కృషిని ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. ఈ క్రమంలోనే.. 2020 అధ్యక్ష ఎన్నికలను తీవ్రంగా వ్యతిరేకించిన ట్రంప్.. ‘నిజానికి ఇప్పుడు నేను మూడోసారి అధ్యక్షుడిగా ఉన్నట్లు లెక్క. కానీ, వివాదాల జోలికి వెళ్లకూడదనుకుంటున్నాను కాబట్టి.. నేను అలా అనను’ అంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. 2020 ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అయితే, తన ఓటమిని అంగీకరించని ట్రంప్.. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఫలితాలను మార్చాలనే ఉద్దేశంతో పలు కీలక రాష్ట్రాల్లో వ్యాజ్యాలు కూడా దాఖలు చేశారు. అయితే, తన ఆరోపణలను నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారు. మరోవైపు జో బైడెన్ ఎన్నికను కాంగ్రెస్ ధ్రువీకరించకుండా అడ్డుకునేందుకు 2021 జనవరిలో ట్రంప్ మద్దతుదారులు అమెరికా క్యాపిటల్ భవనంపై దాడి చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది. ట్రంపే వారిని రెచ్చగొట్టారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

# భారత్ సరిహద్దులపై చైనా నిఘా విస్తరణ..

- **యునాన్‌లో భారీ రాడార్ వ్యవస్థ ఏర్పాటు**
- **5 వేల కిలోమీటర్ల పరిధిలో నిఘా సామర్థ్యం**
- **భారత క్షిపణి పరీక్షలు, హిందూ మహాసముద్రంపై పర్యవేక్షణకు అవకాశం**

**బీజింగ్, జూలై 5:** భారత్ సరిహద్దుల సమీపంలో చైనా తన నిఘా సామర్థ్యాలను మరింత విస్తరిస్తోంది. మయన్మార్ సరిహద్దుకు సమీపంలోని యునాన్ ప్రావిన్సులో చైనా అత్యాధునిక లార్జ్ ఫేజ్డ్ అర్రే రాడార్ (ఎల్పీఏఆర్) వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రాడార్ సుమారు 5 వేల కిలోమీటర్లకు పైగా నిఘా పరిధిని కలిగి ఉండటంతో భారత్ భద్రతాపరంగా కొత్త సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### క్షిపణి కార్యక్రమంపై ప్రభావం

ఈ రాడార్ వ్యవస్థ బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాలను గుర్తించి, వాటి వేగం, మార్గం, గమ్యాన్ని రియల్ టైమ్‌లో పర్యవేక్షించే సామర్థ్యాన్ని




కలిగి ఉందని సమాచారం. దీని పరిధిలో భారత తూర్పు తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం కూడా వస్తుందని చెబుతున్నారు. ఈ ద్వీపం నుంచే భారత్ అగ్ని-5, కే-4 వంటి అధునాతన క్షిపణుల పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ పరీక్షలకు సంబంధించిన కీలక సమాచారాన్ని చైనా సేకరించే అవకాశం ఉందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### హిందూ మహాసముద్రంపై నిఘా

కొత్త రాడార్ ద్వారా బంగాళాఖాతం, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో నిఘా మరింత బలోపేతం కానుంది. ఈ ప్రాంతంలోని వాణిజ్య నౌకాయాన మార్గాలతో పాటు భారత నౌకాదళ కార్యకలాపాలను కూడా పర్యవేక్షించే అవకాశం ఉందని భావిస్తున్నారు. హిందూ మహాసముద్రంలో తన వ్యూహాత్మక ఉనికిని పెంచేందుకు చైనా గత కొంతకాలంగా ప్రయత్నాలు కొనసాగిస్తోంది.

### నిఘా వ్యవస్థల విస్తరణ

చైనాకు ఇప్పటికే జిన్జియాంగ్‌లోని కోర్లా ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి అధునాతన రాడార్ వ్యవస్థలు ఉన్నాయి. యునాన్‌లో ఏర్పాటు చేసిన తాజా రాడార్‌తో భారత్ దక్షిణ, తూర్పు ప్రాంతాలపై నిఘా పరిధిని మరింత విస్తరించే అవకాశముందని రక్షణ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ముంబయిని ముంచెత్తిన కుండపోత

**భారీ వర్షాలతో జలమయమైన నగరం.. రెడ్ అలర్ట్ జారీ**

**వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం**











**ముంబయి, జూలై 5:** ముంబయి మహానగరాన్ని కుండపోత వర్షాలు అతలాకుతలం చేశాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో భారత వాతావరణ శాఖ ముంబయి, రాయ్‌గఢ్ జిల్లాలకు రానున్న మూడు గంటల పాటు రెడ్ అలర్ట్ ప్రకటించింది. కొన్ని ప్రాంతాల్లో గత 23 గంటల్లోనే 250 నుంచి 300 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. శనివారం ఒక్కరోజే పలు ప్రాంతాల్లో 12 గంటల్లో సుమారు 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సముద్రపు పోటు సమయంలోనే భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. రహదారులపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా బేలాపూర్ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న ఓ భవనం బాల్కనీ కూలిపోయింది. నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడగా, రోడ్లు కుంగిపోయాయి. కొన్ని పాత భవనాలు కూడా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. సుమారు 10 వేల మంది సిబ్బందిని రంగంలోకి దింపగా, నగరంలో నీటిని తొలగించేందుకు 448 డీవాటరింగ్ పంపులు, 19 మినీ పంపింగ్ స్టేషన్లు నిరంతరం పనిచేస్తున్నాయి. థానే, పాల్ఘర్ జిల్లాల్లో కూడా భారీ వర్షాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయి. పాల్ఘర్ జిల్లాలో వరద నీటిలో కొట్టుకుపోయి ఆరేళ్ల బాలుడు మృతి చెందగా, వరదల్లో చిక్కుకున్న 180 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వెస్టర్న్ రైల్వే పరిధిలో కొన్ని ప్రాంతాల్లో 250 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనప్పటికీ లోకల్, దూరప్రాంత రైలు సేవలను సాధ్యమైనంతవరకు కొనసాగించినట్లు అధికారులు తెలిపారు. అయితే కొన్ని సబర్బన్ రైళ్లు స్వల్ప ఆలస్యంతో నడిచాయి. సాంకేతిక లోపంతో మెట్రో లైన్--2ఏ సేవలకు కూడా కొంతసేపు అంతరాయం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరింది. ఇదిలా ఉండగా, హిమాచల్ ప్రదేశ్‌లోనూ భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. మండి జిల్లాలో బియాస్ నదిపై దట్టమైన పొగమంచు అలుముకోగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని ప్రజలను అప్రమత్తం చేసింది.

## విరాళాల చోరీ అంశం.. అయోధ్య క్షేత్ర ట్రస్ట్ కీలక భేటీ

**అయోధ్య :** అయెధ్య రామాలయ విరాళాల చోరీపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక ప్రకటన చేసింది. సోమవారం ఆలయ ప్రధాన అధికారులు, అర్చకులు భేటీ అవ్వనున్నట్లు తెలిపింది. ఈ సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్.. ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలపై చర్చించనున్నట్లు సమాచారం. కాగా తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ట్రస్ట్ అధ్యక్షుడు నృత్య గోపాల్ దాస్, ఆరోగ్య సమస్యల కారణంగా ప్రయాణించలేని స్థితిలో ఉన్న సీనియర్ ట్రస్టీ పరాశరన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాజీనామాను ఆమోదిస్తే ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించడం, రామమందిర నిర్వహణకు సంబంధించి భవిష్యత్తులో తీసుకునే చర్యలు, నూతన పరిపాలన వ్యవస్థ ఏర్పాటు వంటి వాటి గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. రామ మందిరంలో విరాళాల చోరీ గురించి ప్రతిపక్షాలు చేసే ఆరోపణలను కూడా పరిశీలించాలని విశ్వ హిందూ పరిషత్ అయోధ్య పోలీసులకు లేఖ రాసింది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణల్లో ఏమైనా వాస్తవాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఆధారాలు, సమాచార మూలాలు, పత్రాలను వారి నుంచి సేకరించాలని సూచించింది. నిందితులను పట్టించే ఏ విషయాన్ని వదలకూడదని విజ్ఞప్తి చేసింది.



# డ్రై ఫ్రూట్స్

## ఏ సమయంలో తినాలి..?



మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచడం కోసం అనేక రకాల పోషకాహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో డ్రై ఫ్రూట్స్ కూడా ఒకటి. కిస్మిస్‌లు, అంజీర్, ఆలుబుఖర వంటివి డ్రై ఫ్రూట్స్ జాబితాకు చెందుతాయి. అంజీర్, ఆలుబుఖరతోపాటు యాప్రికాట్స్ కూడా మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక డ్రై ఫ్రూట్స్‌ను చాలా మంది తింటుంటారు. డ్రై ఫ్రూట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. పలు వ్యాధులను నయం చేయడంలోనూ డ్రై ఫ్రూట్స్ మనకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను రోజులో అసలు ఏ సమయంలో తినాలి..? ఎప్పుడు వీటిని తింటే మనకు అధిక శాతం లాభాలు కలుగుతాయి..? అని చాలా మందికి ప్రశ్నలు తలెత్తుతుంటాయి. ఇక ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

### ఏ సమయంలో తినాలి..?

డ్రై ఫ్రూట్స్ లలో మన శరీరానికి కావల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, బి కాంప్లెక్స్, సితోపాటు పొటాషియం, మెగ్నిషియం, జింక్ వంటి మినరల్స్‌ను మనం డ్రై ఫ్రూట్స్ ద్వారా పొందవచ్చు. ఈ క్రమంలో ఈ పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను ఉదయం తింటేనే అధిక మొత్తంలో లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయం వీటిని బ్రేక్ ఫాస్ట్ తోపాటు కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. దీని వల్ల అధిక మొత్తంలో పోషకాలు, ఆరోగ్యకర ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

### రోజంతా యాక్టివ్‌గా..

రాత్రంతా మన శరీరానికి ఎలాంటి ఆహారం లభించదు. సుమారుగా 10 నుంచి 14 గంటల పాటు శరీరం ఉపవాస దశలో ఉంటుంది. కనుక ఉదయం పూట శరీరానికి పెద్ద ఎత్తున శక్తి అవసరం అవుతుంది. ఈ క్రమంలో డ్రై ఫ్రూట్స్ ను తినడం వల్ల ఆ శక్తిని చాలా వరకు భర్తీ చేయవచ్చు. పైగా ఉదయం నుంచి మనం పనుల్లో యాక్టివ్‌గా ఉంటాం. కొందరు శారీరక శ్రమ కూడా చేస్తుంటారు. కనుక ఉదయం మన శరీరానికి శక్తి అధికంగా అవసరం అవుతుంది. ఇలాంటి సమయంలో డ్రై ఫ్రూట్స్ ను తింటే కావల్సినంత శక్తి లభిస్తుంది. దీంతో రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్దకం పోతుంది. కనుక డ్రై ఫ్రూట్స్ ను ఉదయం పూట తింటేనే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

# బ్రౌన్ రైస్ వర్సెస్ రెడ్ రైస్

## ఎందులో పోషకాలు ఎక్కువ



ఆరోగ్యంగా ఉండేందుకు గాను చాలా మంది ప్రస్తుతం తెల్ల అన్నంకు బదులుగా బ్రౌన్ రైస్ తింటున్నారు. బ్రౌన్ రైస్‌ను రోజూ తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. తెల్ల అన్నానికి బదులుగా రోజూ బ్రౌన్ రైస్‌ను తింటే పలు వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చు. అయితే రైస్‌లో కేవలం బ్రౌన్ రైస్ మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన రైస్ వెరైటీలు ఇంకా అనేకం ఉన్నాయి. వాటిల్లో రెడ్ రైస్ కూడా ఒకటి. ఈ వెరైటీ కూడా మనకు మార్కెట్‌లో లభిస్తుంది. అయితే దీని రంగు కారణంగా చాలా మంది దీన్ని తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ ఈ రైస్ కూడా మనకు అనేక లాభాలను అందిస్తుంది. బ్రౌన్ రైస్‌తో పోలిస్తే రెడ్ రైస్ లోనూ అనేక పోషకాలు ఉంటాయి. అయితే ఈ రెండింటిలో దేన్ని మనం తినాలి, ఎందులో ఎక్కువ పోషకాలు ఉంటాయి..? అన్న వివరాలను పోషకాహార నిపుణులు వెల్లడిస్తున్నారు.

ఫైబర్ విషయానికి వస్తే ఇది బ్రౌన్ రైస్, రెడ్ రైస్ రెండింటిలోనూ ఉంటుంది. కానీ రెడ్ రైస్‌లో ఇది కాస్త ఎక్కువ మోతాదులో ఉంటుంది. కనుక ఫైబర్ విషయంలో రెడ్ రైస్‌ను విన్నర్‌గా చెప్పవచ్చు. అలాగే గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ బ్రౌన్ రైస్ కన్నా రెడ్ రైస్‌కే తక్కువగా ఉంటుంది. కనుక షుగర్ ఉన్నవారికి బ్రౌన్ రైస్ కన్నా రెడ్ రైస్ ఎక్కువ మేలు చేస్తుంది. కాబట్టి ఈ విషయంలోనూ రెడ్ రైస్‌ను విజేతగా చెప్పవచ్చు. అలాగే బ్రౌన్ రైస్‌తో పోలిస్తే రెడ్ రైస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇక ఈ రెండింటిలోనూ మెగ్నిషియం, ఫాస్ఫరస్ సమానంగానే ఉంటాయి. కానీ ఐరన్, జింక్ వంటి పోషకాలు మాత్రం రెడ్ రైస్‌లోనే అధికంగా ఉంటాయి. కనుక ఈ రెండు రకాల రైస్‌లలోనూ రెడ్ రైస్‌ను క్లియర్ విన్నర్ అని చెప్పవచ్చు. కనుక పోషకాల విషయానికి వస్తే రెడ్ రైస్‌లోనే అధికంగా ఉంటాయి. కాబట్టి బ్రౌన్ రైస్‌ను తింటున్నవారు ఈ రైస్‌ను తింటే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుంది.





### రెడ్ రైస్‌తో అనేక లాభాలు..

రెడ్ రైస్‌ను తినడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. ఇందులో ఫ్లేవనాయిడ్స్, ఆంథోసయనిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కనుక ఈ రైస్‌ను తింటే శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. ముఖ్యంగా రక్త నాళాల వాపులు తగ్గుతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రెడ్ రైస్‌ను తినడం వల్ల అధిక మొత్తంలో ఐరన్‌ను పొందవచ్చు. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. దీని వల్ల రక్తహీనత తగ్గుతుంది. అలాగే ఈ రైస్‌ను తింటే జింక్ కూడా ఎక్కువగానే లభిస్తుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీని వల్ల దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. అలాగే పురుషుల ఆరోగ్యం మెరుగు పడుతుంది. వీర్యం అధికంగా ఉత్పత్తి అవుతుంది. సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి. అదేవిధంగా చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

### గుండె ఆరోగ్యానికి..

ఇక రెడ్ రైస్‌ను తింటే మెగ్నిషియం అధికంగా లభిస్తుంది. ఇది రక్త నాళాలను వెడల్పు చేస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ రైస్ ఎంతో మేలు చేస్తుంది. అలాగే గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. రెడ్ రైస్‌ను తినడం వల్ల క్యాల్షియం అధికంగా లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ రైస్‌లోని మెగ్నిషియం కండరాల నొప్పులను తగ్గిస్తుంది. దీని వల్ల రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోవడం కూడా తగ్గుతుంది. రెడ్ రైస్‌ను తింటుంటే షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఈ రైస్‌లో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్‌ను తగ్గిస్తాయి. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా రెడ్ రైస్ వల్ల మనకు అనేక లాభాలు ఉంటాయి. కనుక బ్రౌన్ రైస్ తింటున్నవారు ఈ రైస్‌ను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోండి. దీని వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

జనం వార్త

సోమవారం 06 జూలై 2026



బ్యాంకు ఖాతాలు, లాకర్లు ఉన్న వారికి ఇప్పటిదాకా ఒక్కరినే నామినీగా పేర్కొనే అవకాశం ఉండేది. కానీ, ఇకపై నలుగురిని నామినీగా ఉంచే వీలుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధనలు నవంబరు 1, 2025 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మార్పుల వల్ల ఖాతాదారులకు ఎలాంటి ప్రయోజనాలుంటాయో చూద్దామా..?

మన దేశంలోని బ్యాంకుల్లో దాదాపు రూ.67,000 కోట్లకు పైగా డబ్బు ఎవరూ వెనక్కి తీసుకోకుండా అలా ఉండిపోయింది. ఖాతాదారుడు మరణించిన తర్వాత, ఉన్న ఒక్క నామినీ అందుబాటులో లేకపోవడం, లేదా క్లెయిం చేసుకోకపోవడం వల్ల ఇలా జరుగుతోంది. దీంతో కుటుంబ సభ్యులు, డబ్బులు వెనక్కి తీసుకోవడం కోసం పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఇవి బ్యాంకు పొదుపు ఖాతా, ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్ ఖాతాలతో పాటు, లాకర్లకూ వర్తిస్తాయి.



# బ్యాంకు ఖాతాకు నలుగురు నామినీలు

## ఒకేసారి నలుగురి నామినేషన్:

మీరు మీ ఖాతాకు ఒకేసారి నలుగురిని నామినీలుగా పేర్కొనవచ్చు. అంతేకాదు, ఎవరికి ఎంత వాటా (శాతం) వెళ్లాలి అన్నదీ మీరే నిర్ణయించుకోవచ్చు. ఉదాహరణకు జీవిత భాగస్వామికి 50 శాతం, మిగతాది పిల్లలకు అన్నట్లు పంపకాలు చేయొచ్చు.

## ఒకరి తర్వాత మరొకరు :

నలుగురు నామినీలను వరుస క్రమంలోనూ ఏర్పాటు చేయొచ్చు. అంటే, మొదటి నామినీ అందుబాటులో లేకపోతే, రెండో నామినీకి అర్హత వస్తుంది. వారూ లేకపోతే మూడో వారికి... ఇలా ఒకరి తర్వాత మరొకరికి అవకాశం ఉంటుంది. డిపాజిట్ ఖాతాలకు పైన చెప్పిన రెండు పద్ధతుల్లో మీకు నచ్చిన విధానాన్ని ఎంచుకోవచ్చు.

లాకర్లలోని వస్తువులను పంచడం కష్టం కాబట్టి, కేవలం ఒకరి తర్వాత ఒకరు అనే పద్ధతిలో మాత్రమే నామినేట్ చేయాలి. నామినీ పేర్లను నమోదు చేసేటప్పుడు, వారి ఫోన్ నంబరు, ఇ-మెయిల్ ఐడీ వంటి వివరాలూ ఇవ్వాలి. దీనివల్ల అవసరమైన సందర్భంలో బ్యాంకు వారిని సులభంగా సంప్రదించగలదు.



## లాభాలేమిటి?

- మీ డబ్బు ఎవరికి చెందాలనే విషయంలో మీకు పూర్తి స్వేచ్ఛ, స్పష్టత ఉంటాయి.
- ఖాతాదారుడి మరణానంతరం కుటుంబ సభ్యులు డబ్బులను వెనక్కి తీసుకోవడానికి ఇబ్బంది పడక్కర్లేదు.
- వారసత్వ గొడవలు, చట్టపరమైన సమస్యలూ తగ్గుతాయి.
- బ్యాంకుల్లో ఎవరూ పట్టించుకోని డబ్బు మొత్తం గణనీయంగా తగ్గే వీలుంది.
- ఈ కొత్త విధానం కేవలం బ్యాంకు ఖాతాలకే పరిమితం కాదు. త్వరలోనే మ్యూచువల్ ఫండ్లు, డీమ్యాట్ ఖాతాలు, ఇన్సూరెన్స్ పాలసీలకూ రానుంది. దీనివల్ల ఈ ఖాతాల్లోని సొమ్మును క్లెయిం చేసుకోవడం సులభం అవుతుంది.

# వాట్సప్ స్క్రీన్ షేర్ చేస్తే మీ ఖాతా ఖాళీ

సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ తరుణంలో ప్రజలు మోసాల బారిన పడకుండా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ప్రజలను దోచుకుంటున్నారు. డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, ఓటీపీ తరహా సైబర్ మోసాలపై పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో కొత్తగా వాట్సప్ స్క్రీన్ షేరింగ్‌తో మోసాలను మొదలుపెట్టారు.

కస్టమర్ సపోర్ట్, బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి మీ అకౌంట్‌లో సమస్యలున్నాయని లేదా ఇ-కేవైసీ అప్‌డేట్ చేయాలని కేటుగాళ్లు నమ్మబలుకుతారు. వెంటనే చేయకపోతే అకౌంట్ బ్లాక్ అవుతుందంటూ కంగారు పెడతారు. అసలు ఆలోచించడానికే సమయం ఇవ్వరు. మీరు వీడియో కాల్ చేసి వాట్సప్ స్క్రీన్ షేర్ చేస్తే ఆ ప్రక్రియంతా తామే పూర్తి చేస్తామని నమ్మబలుకుతారు. వారి మాటలు నమ్మి ఒకసారి స్క్రీన్ షేర్ చేశారో ఇక అంతే మీ ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లినట్లే. మీ ఖాతాల్లో సొమ్ము మొత్తం ఖాళీ చేస్తారు. ఇటీవల కాలంలో ఈ తరహా నేరాలు పెరిగిపోతున్నాయి. దీంతో ఎవరు ఫోన్ చేసి స్క్రీన్ షేర్ చేయమని అడిగినా ఎట్టి పరిస్థితుల్లో చేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

## స్క్రీన్ షేరింగ్ మోసం ఇలా..

స్క్రీన్ షేరింగ్ అంటే ఒక డివైజ్ స్క్రీన్ ఇంకొక డివైజ్‌లో డిస్‌ప్లే అవ్వడం. హ్యాకర్ ఎవరినైతే లక్ష్యంగా చేసుకుంటాడో అతడి వాట్సప్ స్క్రీన్‌షేరింగ్‌ను తన కంప్యూటర్‌లో కనిపించేలా చేస్తాడు. సాధారణంగా వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసేటప్పుడు సాంకేతికంగా సమస్య తలెత్తిన సందర్భాల్లో నిపుణులు స్క్రీన్ షేర్ లేదా రిమోట్‌గా మన పీసీని ఆపరేట్ చేస్తుంటారు. అదే తరహాలో మిమ్మల్ని మాటల్లో పెట్టి మీ ఫోన్‌లో చేసే ప్రతిదీ నేరగాళ్లు తెలుసుకుంటారు. పిన్, పాస్‌వర్డ్, ఓటీపీలన్నీ చూస్తారు. తద్వారా మీ ఖాతాలోని నగదు కాజేస్తారని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

## అస్సలు నమ్మొద్దు: పోలీసులు

"కస్టమర్ సపోర్ట్, బ్యాంక్ సిబ్బంది పేరిట కాల్స్ చేసి వాట్సప్ స్క్రీన్ షేరింగ్ ఇవ్వాలని కోరితే అస్సలు నమ్మొద్దు. సాయం చేస్తామని నమ్మించి మీ అకౌంట్‌లోని డబ్బులు కాజేస్తారు. ఖాతా వివరాలు, ఓటీపీ తస్కరిస్తారు. అపరిచిత కాల్స్‌తో అప్రమత్తంగా ఉండండి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఏమరపాటుగా ఉండొద్దు. మీ సన్నిహితులు, ఇంట్లోని పెద్దలకు ఇలాంటి మోసాలపై అవగాహన కల్పించండి" అని పోలీసులు కోరుతున్నారు. ఇవే కాదు.. వాట్సప్ గ్రూపుల్లో వచ్చే ఇన్వెస్ట్‌మెంట్ టిప్స్ నమ్మొద్దని హితవు పలుకుతున్నారు. ఈజీమనీ ఆశతో ఎలాంటి లింక్‌లపైనా క్లిక్ చేయొద్దని, వాట్సప్ గ్రూపుల్లో వచ్చే ఏపీకే ఫైల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేయొద్దని పోలీసులు సూచిస్తున్నారు.



జనం వార్త

# మీరు వాడుతున్న తేనె స్వచ్ఛమైనదేనా..?

## ఇలా గుర్తించండి..!



తేనెను తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల విటమిన్లు, మినరల్స్, పోషకాలకు తేనె నిలయం. పలు అనారోగ్యాలను తగ్గించడంలో, శరీరానికి శక్తినివ్వడంలో తేనెకు అధిక ప్రాధన్యత ఉంది. ఆయుర్వేదంలోనూ తేనెను పలు ఔషధాలతోపాటుగా ఇస్తారు. అయితే ప్రస్తుత తరుణంలో తేనె వాడకం ఎక్కువవడంతో వ్యాపారులు దాన్ని కూడా కల్తీ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలకు స్వచ్ఛమైన తేనె ఏదో నకిలీ తేనె ఏదో గుర్తించడం కష్టతరమైంది. అయితే పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను ఇట్టే గుర్తించవచ్చు. దీంతో ఆరోగ్యంపై ప్రభావం పడకుండా జాగ్రత్తగా ఉండవచ్చు.



### నురగ వచ్చిందంటే..

ఇక సాధారణంగా మొలాసిస్, మొక్కజొన్న పిండి తదితర పదార్థాలను ఉపయోగించి నకిలీ తేనెను తయారు చేస్తారు. ఈ క్రమంలో నకిలీ తేనెను గుర్తించడం చాలా సులభమే అని చెప్పవచ్చు. కొద్దిగా తేనె తీసుకుని దానికి 2, 3 చుక్కల వెనిగర్ ఎస్సెన్స్ కలపాలి. అనంతరం వాటిని బాగా మిక్స్ చేయాలి. ఇలా వచ్చిన మిశ్రమం ఎక్కువగా నురగను విడుదల చేస్తుంటే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి. ఎందుకంటే నకిలీ తేనె కోసం ఉపయోగించే పదార్థాల్లో చక్కెర కూడా ఉంటుంది. ఇది వెనిగర్‌తో కలిసినప్పుడు నురగలాంటి ద్రవాన్ని ఇస్తుంది. అసలైన తేనె ఇలా నురగను ఇవ్వదు. అలాగే కొద్దిగా తేనెను తీసుకుని బొటనవేలిపై వేయాలి. అనంతరం దాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. ఆ తేనె చుక్క వేలిపై చుట్టూ విస్తరిస్తే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి.

### నీటిలో కలిపితే..

మీరు కొన్న తేనె అసలుదో, నకిలీదో గుర్తించాలంటే దాన్ని ఒక టేబుల్ స్పూన్ మోతాదులో తీసుకుని ఒక గ్లాస్ నీటిలో వేయాలి. నకిలీ తేనె అయితే వెంటనే నీటిలో కరుగుతుంది. అసలు తేనె గ్లాస్ అడుగు భాగంలోకి చేరుతుంది. అంతే తప్ప నీటిలో అంత త్వరగా కరగదు. అలాగే ఒక కాటన్ బాల్‌ను తీసుకుని దాన్ని తేనెలో ముంచాలి. అనంతరం దానికి అగ్గిపుల్లతో నిప్పు పెట్టాలి. అసలు తేనె అయితే కాటన్ బాల్ మండుతుంది. నకిలీ తేనె అయితే కాటన్ బాల్ మండదు. అదేవిధంగా ఒక తేనె చుక్కను గోరుపై వేసుకోవాలి. ఆ చుక్క గోరుపై అటు ఇటు కదిలితే అది నకిలీ తేనె అన్నమాట. అదే ఆ చుక్క కదలకుండా స్థిరంగా ఉంటే ఆ తేనెను అసలైందిగా భావించాలి.





### తేనెకు అసలు ఎక్స్‌పైరీ ఉండదు..

ఇక సాధారణంగా స్వచ్ఛమైన తేనె అయితే అసలు ఎక్స్‌పైరీ ఉండదు. కానీ మనకు మార్కెట్‌లో లభించే తేనెలో కొందరు రసాయనాలు కలుపుతారు. కనుక మనం కొనే తేనెకు ఎక్స్‌పైరీ ఉంటుంది. కానీ సహజసిద్ధంగా కొన్న తేనె అయితే ఎన్ని రోజులు ఉన్నా పాడవదు. రోజులు గడిచే కొద్దీ ఇంకా రుచి పెరుగుతుంది. మార్కెట్‌లో మీరు తేనె కొంటే వీలైనంత వరకు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన తేనె అయితే మంచిది. అది కల్తీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఇలా పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను గుర్తించడంతోపాటు దాన్ని కొనకుండా జాగ్రత్త పడవచ్చు.


# ఫోన్లను ఈ ప్రదేశంలో ఉంచడం చాలా ప్రమాదకరం..!

స్మార్ట్ ఫోన్లు అనేవి ప్రస్తుతం మన నిత్య జీవితంలో భాగం అయిపోయాయి. ఇంకా చెప్పాలంటే అవి మన నిత్యావసర వస్తువుగా మారాయి. ఫోన్లు లేకపోతే ఈ ప్రపంచాన్ని అసలు ఊహించుకోలేం అన్నంతగా పరిస్థితి మారింది. చాలా పనులను మనం ఫోన్లతో చక్కబెట్టుకుంటున్నాం. ఇప్పుడు 5జి అందుబాటులో ఉండడంతో చాలా వేగంగా అనేక పనులను చేసుకోగలుగుతున్నాం. అయితే అంతా బాగానే ఉంది కానీ ఫోన్లను వాడడంలోనే అసలు సమస్యంతా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫోన్లను ఎక్కడ పడితే అక్కడ పెట్టి ఉపయోగించకూడదని వారు హెచ్చరిస్తున్నారు. ఫోన్లను చాలా మంది అసలు ఏయే ప్రదేశాల్లో పెడుతుంటారు.. ఎలా వాడుతుంటారు.. వాటి వల్ల మనకు ఎలాంటి హాని కలుగుతుంది.. అన్న వివరాలను వైద్యులు తెలియజేస్తున్నారు.

### చార్జర్‌పై పెట్టడం..

చాలా మంది ఫోన్లను చార్జింగ్ పెట్టి వాటిని కింద పెట్టేందుకు టేబుల్, స్టూల్ లాంటిది ఏదీ లేదని చెప్పి వాటిని చార్జర్‌పైనే పెడతారు. కానీ ఇలా చేయరాదు. దీని వల్ల రేడియేషన్ బాగా వస్తుందని వైద్యులు అంటున్నారు. కనుక ఫోన్లను చార్జింగ్ పెట్టినప్పుడు వాటిని చార్జర్లపై ఉంచరాదు. అలాగే ఓవర్ నైట్ చార్జింగ్ కూడా ఫోన్లను పెట్టరాదు. దాని వల్ల ఫోన్లు పేలిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే చాలా మంది దిండు కింద ఫోన్లను పెట్టి నిద్రిస్తారు. ఇలా చేయకూడదు. ఇలా చేస్తే శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా చర్మ





సమస్యలు వస్తాయి. కనుక నిద్రించేటప్పుడు ఫోన్లను దిండ్ల కింద అస్సలు పెట్టరాదు.

### జేబుల్లో ఉంచడం..

అమ్మాయిలకు ఎక్కువగా ఫోన్లను వెనుక జేబులో పెట్టుకునే అలవాటు ఉంటుంది. కానీ ఇలా చేయడం వల్ల ఫోన్ నుంచి వచ్చే రేడియేషన్ కడుపు నొప్పి, కాళ్ల నొప్పిని కలిగిస్తుంది. కనుక ఫోన్లను బ్యాక్ పాకెట్లలో పెట్టరాదు. అలాగే పురుషులు ఎక్కువగా ఫోన్లను ప్యాంటు ముందు జేబులో పెడతారు. ఇలా చేస్తే ఫోన్ల నుంచి వచ్చే రేడియేషన్ వల్ల వీర్య కణాలు నాశనం అవుతాయి. దీంతో సంతానం కలిగేందుకు అవకాశం తక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే చాలా మంది నిద్రించేటప్పుడు తల పక్కన ఫోన్లను పెట్టి పడుకుంటారు. ఇలా చేయడం వల్ల ఫోన్ నుంచి విపరీతమైన రేడియేషన్ వస్తుంది. ఇది మెదడుపై ప్రభావం చూపిస్తుంది. దీని వల్ల మెదడులో కణతులు ఏర్పడే అవకాశం ఉంటుంది. అది బ్రెయిన్ ట్యూమర్‌కు దారి తీయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

### చార్జింగ్ పెట్టినప్పుడు..

ఇక చాలా మంది ఫోన్‌ను చార్జింగ్ పెట్టినా కూడా ఏదైనా కాల్ లేదా మెసేజ్ వస్తే చార్జింగ్ అలాగే ఉంచి దాన్ని ఉపయోగించుకుంటారు. ఇలా కూడా చేయకూడదు. ఇది అత్యంత ప్రమాదకరం. దీని వల్ల ఫోన్ అధికంగా రేడియేషన్, హీట్‌కు గురై త్వరగా పేలిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే ఫోన్లకు కంపెనీలు ఇచ్చిన చార్జర్‌లనే ఎల్లప్పుడూ ఉపయోగించాలి. అలా కుదరకపోతే ఫోన్‌కు ఉన్న చార్జింగ్ కెపాసిటీకి సరిపోయే చార్జర్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. అలాగే ఫోన్‌ను చార్జింగ్ చేసిన అనంతరం కచ్చితంగా చార్జర్ ఉన్న స్విచ్ ను ఆఫ్ చేయాలి. ఈ విధంగా పలు సూచనలు పాటిస్తే ఫోన్లను జాగ్రత్తగా ఉపయోగించుకోవచ్చు. సురక్షితంగా ఉండవచ్చు.





## గానుగ నూనెలే ఆరోగ్యానికి శ్రీరామరక్ష

- అనఘాపురి కాలనీలో శ్రీరామ నేచురల్స్ గానుగ నూనె కేంద్రం
- గానుగ నూనెల పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- గానుగ నూనె కేంద్రాన్ని నెలకొల్పిన గంద్రతి శ్రీనివాస్

**బోడుప్పల్ :** సహజసిద్ధమైన గానుగ నూనెలను వాడడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని అనఘాపురి కాలనీ వ్యవస్థాపక అధ్యక్షులు వెల్లెంకి జయపాల్ రెడ్డి అన్నారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అనఘాపురి కాలనీ రోడ్డు నెంబర్-1 లో ఏర్పాటుచేసిన "శ్రీరామ నేచురల్స్" గానుగ నూనెల విక్రయ కేంద్రం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాలనీ వ్యవస్థాపక అధ్యక్షులు వెల్లెంకి జయపాల్ రెడ్డి కాలనీ ముఖ్యులు మెంతెన అబ్బసాయిలు, కొంగరి సంతోష్ లతో కలిసి గానుగ నూనె యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేటి యాంత్రిక నగర జీవితంలో ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య రక్షణలో భాగంగా గానుగ యంత్రాలతో పట్టిన వంట నూనెలను వాడాలని సూచించారు. మనిషి ఆరోగ్య రక్షణలో వంట నూనెల పాత్ర ఎంతగానో ఉందని వారు అభిప్రాయపడ్డారు. కాలనీలో గానుగ నూనె విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ నేచురల్స్ గానుగ నూనె విక్రయ నిర్వాహకులు గంద్రతి శ్రీనివాస్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలించిన ముద్దం నర్సింహ యాదవ్

- ఇంటింటికీ ఫారాలు చేరేలా చర్యలు తీసుకోవాలి
- ఓటరు జాబితా నవీకరణలో ప్రజలు సహకరించాలని పిలుపు



**సికింద్రాబాద్ :** ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో కొనసాగుతున్న (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ఆదివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు సక్రమంగా పంపిణీ అవుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, బి ఎల్ ఓలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజలు కూడా తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి, అవసరమైన పత్రాల తో కలిసి సంబంధిత బి ఎల్ ఓ లకు సకాలంలో అందజేసి ఓటరు జాబితా నవీకరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముద్దం నర్సింహ యాదవ్ విజ్ఞప్తి చేశారు.



## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ నూతన కమిటీ సభ్యుల సన్మానం

**ఉప్పల్ :** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు, కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన కమిటీ అధ్యక్షుడు జె. సుధాకర్, ప్రధాన కార్యదర్శి అఖిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కాలనీలో విద్యుత్, డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఫాగింగ్ తదితర సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీలోని తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే కాలనీలో పర్యటించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మహేష్ గౌడ్, కాలనీ ఉపాధ్యక్షుడు బి. కృష్ణ, సహాయ కార్యదర్శులు మునీర్, మల్లేష్, కోశాధికారి ఎ. శ్రీనివాస్, కమిటీ సభ్యులు రాజేష్, శ్రీనివాస్, మాదేశ్, హరీష్, రామస్వామి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో జీహెచ్ఎంసీకి క్యూర్ చట్టం

- 70 ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి బదులుగా కొత్త కోర్ అర్బన్ రీజియన్ బిల్లు
- జూలై 24 వరకు ప్రజల అభిప్రాయాలకు ఆహ్వానం

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం జీహెచ్ఎంసీ చట్టం-1955కు బదులుగా కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటె డ్ గవర్నెన్స్) బిల్లు- 2026ను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా బిల్లును ప్రజల అభిప్రాయాల కోసం విడుదల చేసింది. ఏడు దశాబ్దాల క్రితం రూపొందిన జీహెచ్ఎంసీ చట్టంలోని కాలానుగుణంగా కోల్పోయిన నిబంధనలను తొలగిస్తూ, ఆధునిక పట్టణ పాలనకు అనుగుణంగా కొత్త చట్టాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. సమగ్ర పట్టణ పాలన, పౌరులకు సులభ సేవలు, నెట్ జీరో లక్ష్యం, ప్రజారోగ్య మెరుగుదల, వ్యాపార సౌలభ్యం వంటి అంశాలకు బిల్లులో ప్రాధాన్యం కల్పించింది. ముసాయిదా బిల్లుపై ప్రజలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియే షన్లు, పరిశ్రమలు, నిపుణులు, పౌరసమాజ సంస్థలు తమ సూచనలు, అభిప్రాయాలను 2026 జూలై 24 లోగా ఆన్‌లైన్‌లో లేదంటే లిఖితపూర్వకంగా ప్రభుత్వానికి పంపవచ్చని పేర్కొంది. ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన పట్టణ పాలనకు ఈ చట్టం దోహదపడుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రజలు అప్రమత్తమై సూచనలు, సలహాలు, అభ్యంతరాలు వ్యక్తం చేయాలి.



## ఓటు హక్కును పరిరక్షించుకోవాలంటే ఓటరు చైతన్యం అవసరం

**జంపన ప్రతాప్**

**సికింద్రాబాద్ :** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించుకోవడాని కి ప్రతి ఓటరు చైతన్యవంతంగా వ్యవహరించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా న్యూ బోయినపల్లి పెన్షన్ లైన్, నేతాజీ నగర్, కడక్‌పుర ప్రాంతాల్లో ఆదివారం బీఎల్వోలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తిగా నింపి, భారత ఎన్నికల సంఘం సూచించిన అవసరమైన రుజువు పత్రాలను జత చేసి జూలై 24లోపు సంబంధిత బి ఎల్ ఓ లకు అందజేయాలని ఓటర్లకు సూచించారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఎన్నికల అధికారి గుప్తా, బి ఎల్ ఓ మంజు, కాంగ్రెస్ నాయకులు మారుతి గౌడ్, సదానంద్, శరత్, ముకేశ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**నేర్థం భాస్కర్ గౌడ్**




**ఉప్పల్ :** మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు నేర్థం భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ అఖిలపక్ష తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి గజ్జల సత్యరాజ్ అధ్యక్షత వహించగా, పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు హాజరయ్యారు. సమావేశంలో తొలిదశ తెలంగాణ ఉద్యమకారులను శాలువాలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నేర్థం భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని, 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలవారీ పెన్షన్, గుర్తింపు కార్డులు, ఆరోగ్య కార్డులు తదితర హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయకుండా తక్షణమే అమలు చేయాలని ఈ సమావేశం ద్వారా ఉద్యమకారుల కమిటీ తరఫున ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోపు సదానంద్, అంబటి జగదీష్ ముదిరాజ్, చీమ శ్రీనివాస్, తెలంగాణ సంపత్, కురావత్ కృష్ణ నాయక్, సకినాల ప్రసాద్, తొలి దశ ఉద్యమకారులు మాటేటి కైలాసం, లక్ష్మీనారాయణ పటేల్, ఆడెపు శివకుమార్ నేత, బొల్లెపల్లి స్వామి, మహిళా నాయకులు కళావతి, నస్రీన్, లక్ష్మి, ధనుంజయ గౌడ్, మేకల శ్రీనివాస్, గణేష్ నేత, గన్నోజు సదానంద్ చారి, గిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సందెల శ్రీనివాస్, మురళి చారి, హమీద్, సురేష్ దండు, కీర్తి శ్రీనివాస్, ధనుంజయ చారి, దయానంద్, భూపాల్, జగన్ యాదవ్, బాల నరసింహ, రవి, ఉమేష్ సింగ్, సత్యనారాయణ, వస్త్రాల వెంకటేష్, దొమ్మటి కిరణ్ కుమార్ రావు, చిందం నరసింహ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.




## బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆరోగ్య పరీక్షల శిబిరం

**సికింద్రాబాద్ :** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్--1 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. రాహుల్ రెడ్డి చొరవతో ఆదివారం బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ప్రతిరోజూ రద్దీ రహదారులపై తీవ్ర ఎండ, వర్షం, కాలుష్యాన్ని ఎదుర్కొంటూ విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఆరోగ్యం, శారీరక దృఢత్వం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నివారణ ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడం, ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ పోలీసుల విధులు అత్యంత శ్రమతో కూడుకున్నవని, విధులను సమర్థవంతంగా నిర్వహించాలంటే ప్రతి పోలీసు అధికారి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని రెటినోవా ఫౌండేషన్, శ్రీకర హాస్పిటల్, ప్లానెట్ ఆప్టిక్స్, పద్మ సాయి డెంటల్ క్లినిక్, స్కై ఫిట్ ఫిజియోథెరపీ సంయుక్తంగా నిర్వహించాయి. వైద్య బృందంలో డాక్టర్లు భవానీ, సాయి వంశీ, తిలక్, హరిత, ప్రవళికతో పాటు ఆప్టోమెట్రిస్ట్ భరత్ కుమార్ పాల్గొని పోలీసు సిబ్బందికి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, ఫిజియోథెరపీ సంప్రదింపులు, ఆరోగ్య సలహాలు అందించగా, పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు సహకరించిన వైద్యులు, వైద్య నిపుణులు, సేవా సంస్థల ప్రతినిధులకు ట్రాఫిక్ పోలీసులు కృతజ్ఞతలు తెలియజేయడంతో కార్యక్రమం ముగిసింది.



## న్యూయార్క్‌లో కాల్పుల కలకలం

**న్యూయార్క్ :** అమెరికాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ.. న్యూయార్క్‌లో కాల్పులు కలకలం రేపాయి. బ్రూక్లిన్ సమీపంలోని కోనీ ఐలాండ్‌లో బాణసంచా ప్రదర్శనను తిలకిస్తున్న వేళ అక్కడి సమూహంపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు మైనర్లు సహా ఎనిమిది మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఓ 21 ఏళ్ల యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు న్యూయార్క్ పోలీసులు వెల్లడించారు. బాధితులను గుర్తించాల్సి ఉందని, ఆ తర్వాతే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఘటనా స్థలం నుంచి ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు జరుగుతోందన్నారు.

## ఒవైసీకో న్యాయం.. ఇతరులకో న్యాయమా?

**కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్న**




**హైదరాబాద్:** ఒవైసీకి చెందిన ఫాతిమా విద్యాసంస్థలపై హైకోర్టు ప్రశ్నలు సంధిస్తున్నా ప్రభుత్వం వివరణ ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. భాజపా అధికా రంలోకి వస్తే ఫాతిమా విద్యాసంస్థలను కూల్చేస్తామని హెచ్చరించారు. ఆదివా రం ఈ మేరకు సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. "అక్బరుద్దీన్ ఒవైసీ కాంగ్రెస్ అండతోనే హైకోర్టునే బెదిరిం చేలా హద్దులు మీరి మాట్లాడుతున్నారు. ప్రభుత్వం మౌనంగా ఎందుకు ఉంటోంది. గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న విద్యాసంస్థలను కూల్చేస్తామంటూ నోటీసుల మీద నోటీసులిస్తున్నారు. అక్బరుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలోని ఫాతిమా విద్యా సంస్థల జోలికి సర్కారు ఎందుకు వెళ్లడం లేదు? ఒవైసీకి ఒక న్యాయం ఇతరులకు ఇంకో న్యాయమా? భాజపా అధికారంలోకి వస్తే అక్రమార్కులకు, అవినీతిపరులకు భయమంటే ఏమిటో చూపిస్తాం" అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# చీకట్లో మగ్గుతున్న పట్టణ ప్రజలు!

- పేరుకే 'మున్సిపాలిటీ'.. వసతులు మాత్రం పాతాళంలో..
- నియోజకవర్గంలో అమావాస్య చీకటి.. దమ్మపేటకేమో వరాలు.?
- హోదా పెరిగినా మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం
- అధికారులు జీతాలు తీసుకోవడానికేనా.? ప్రజా సమస్యలు పట్టవా.?





**అశ్వారావుపేట :** "పేరు గొప్ప.. ఊరు దిబ్బ" అనే సామెతను నిజం చేస్తున్నారు అధికారులు.. హోదా పెరిగిన నిధుల విడుదలలో మాత్రం నిర్లక్ష్యం తాండవిస్తుంది.. పంచాయితీ నుండి పురపాలకంగా పదోన్నతి పొందిన రాత్రిళ్ళు మాత్రం చీకటి తోనే సహవాసం చేయాల్సిన వస్తుంది. ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యే, పైగా ఒక మంత్రి ఇలాకాగా ఉన్న మండలం 'దమ్మపేట' అయితే.. నియోజకవర్గ కేంద్రం మాత్రం అశ్వరావుపేట. నియోజకవర్గ కేంద్రం అనే హోదా చాలదన్నట్లు, దీనికి 'మున్సిపాలిటీ' అనే సరికొత్త బంగారు ఆభరణాన్ని కూడా తగిలించారు పాలకులు. ఆభరణం అయితే మెరుస్తోంది, కానీ, దాని వెనుక ఉన్న నియోజకవర్గ తలరాత మాత్రం నల్లటి చీకట్లోనే మగ్గుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా, రంగుల పోస్టర్లతో శంకుస్థాపన నోచుకున్న సెంట్రల్ లైటింగ్ పనులు అటకెక్కాయి. కలల దీపంగానే మారాయా? అసలు శంకుస్థాపన చేసింది ఎవరు? కొబ్బరికాయ కొట్టింది ఎవరు? అనే విషయాలు ప్రజలకు అనవసరం. పనులు పూర్తి చేసి, రాత్రి పూట వెలుగులు నింపింది ఎవరు అనేదే ముఖ్యం. కానీ ఇక్కడ ప్రభుత్వాలు మారాయి, పాలకులు మారారు.. కానీ అశ్వారావుపేట నియోజకవర్గ తలరాత మాత్రం మారలేదు. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు.. మున్సిపాలిటీ హోదా ఉన్నా, సెంట్రల్ లైటింగ్ లేక రోడ్లన్నీ చీకటి రాజ్యాన్ని తలపిస్తున్నాయి. ఈ సెంటర్ లైటింగ్ కాంట్రాక్టర్లు ఉడాయించారా? నిధులు నొక్కేశారా? అన్న అనుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. అశ్వారావుపేట తో పాటు ములకలపల్లి మండల కేంద్రం కూడా చీకట్లోనే మగ్గుతుంది. పని చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నా, ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం వల్లే కాంట్రాక్టర్లు ఇక్కడి నుంచి సర్దుకుని ఉడాయించారనే చర్చ జరుగుతుంది. "పిల్లికి బిచ్చం పెట్టని చందాన" నిధులు విడుదల చేయకుండా, పనులు చేయమంటే కాంట్రాక్టర్లు మాత్రం జేబుల నుంచి ఎంతకాలం ఖర్చు పెడతారు? అందుకే బోర్డులు తిప్పేసి చెక్కేసారనే గుసగుసలు నియోజకవర్గంలో గట్టిగా వినిపిస్తున్నాయి.

### అమావాస్యకో, పౌర్ణమికో 'అయ్యవారి' దర్శనం

నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అయితే రాజసంగా వెలిసింది. కానీ, అక్కడ ప్రజాప్రతినిధుల, అధికారుల దర్శనం మాత్రం "అమావాస్యకో, పౌర్ణమికో" అన్నట్లు సాగుతోంది. ఐదోతనం లేని ముత్తైదువులా.. అన్నీ ఉండి కూడా అశ్వారావుపేట వెలవెలబోతోంది. దమ్మపేటలో 'కల కలలు'.. మిగిలిన చోట్ల మాత్రం 'కలతలే' అలుముకున్నాయి. ఈ నియోజకవర్గంలో చిత్ర విచిత్రమైన వివక్ష ఒకటి నడుస్తోంది. ఒక్క దమ్మపేట మండలానికి వస్తే మాత్రం సర్వ వసతులు, తళతళలాడే వెలుగులు, కలకలలాడే నిధులు కనిపిస్తాయి. అక్కడ రాత్రి కూడా పగలును తలపిస్తుంది. మరి మిగిలిన మండలాల ప్రజలు చేసిన పాపం ఏమిటి? వారు పన్నులు కట్టడం లేదా? లేక అక్కడి ఓటర్లు చెల్లని రూపాయిలా? దమ్మపేట నియోజకవర్గంలో భాగమే అయినప్పుడు, మిగిలిన మండలాల్లో ఎందుకు ఈ చీకటి రాత్రులు? అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా ఏమీ ఎరగనట్లు నటించడం మానేసి, సమస్యను పరిష్కరించాలి. మున్సిపాలిటీ బోర్డులు మార్చడం కాదు.. ముందు అశ్వారావుపేట, ములకలపల్లి వీధుల్లో లైట్లు వేసి, నిధులెక్కడ ఆగిపోయాయో సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.. మండలాల వారీగా ఉన్న ఈ వివక్షను, నిధుల కొరతను సరిచేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందిస్తారో, లేక యథావిధిగా కాలయాపన చేస్తారో వేచి చూడాలి. జీతాలు ప్రజా ధనం నుంచి తీసుకుంటున్నప్పుడు, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన కనీస ధర్మం అధికారులకు లేదా? ఇప్పటికైనా ఈ నగరపాలక, నియోజకవర్గ అధికారులు తమ మొద్దు నిద్ర వీడి, ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి అసంపూర్తిగా ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులపై దృష్టి పెట్టాలి. కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించి వీధుల్లో వెలుగులు నింపాలి. లేనిపక్షంలో, అశ్వారావుపేట, ములకలపల్లి ప్రజల ఆగ్రహానికి అధికారులు గురికావాల్సి వస్తుంది.

జనం వార్త




# శర్వరి అందం, స్టైల్‌తో నెటిజన్లు ఫిదా

మోస్ట్ బ్యూటిఫుల్ బాలీవుడ్ బ్యూటీ శర్వరి వాఘ్‌కు తెలుగు ప్రేక్షకుల్లో పెద్దగా పరిచయం లేకపోయినా, హిందీ చిత్రసీమలో మాత్రం మంచి గుర్తింపు ఉంది. వరుస అవకాశాలతో ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీయెస్ట్ హీరోయిన్లలో ఒకరిగా కెరీర్‌ను కొనసాగిస్తోంది. సినీ ప్రయాణాన్ని సహాయ దర్శకురాలిగా ప్రారంభించిన శర్వరి, 2020లో అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలైన ది ఫర్గాటెన్ ఆర్మీ -- ఆజాదీ కే లియే వెబ్ సిరీస్‌తో నటిగా ఎంట్రీ ఇచ్చింది. అనంతరం 2021లో విడుదలైన 'బంటీ ఔర్ బబ్లీ 2' సినిమాతో వెండితెరపై అడుగుపెట్టింది. తాజాగా ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటించిన ఆల్ఫా చిత్రంలోనూ శర్వరి కీలక పాత్రలో నటించింది. సినిమాల్లో తన గ్లామర్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ అందాల భామ, సోషల్ మీడియాలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. ఎప్పటికప్పుడు స్టైలిష్ ఫోటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటూ నెట్టింట సందడి చేస్తోంది. తాజాగా శర్వరి షేర్ చేసిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ లేటెస్ట్ ఫోటోల్లో భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌తో మెరిసే చీరను ధరించిన శర్వరి, దానికి మ్యాచ్ అయ్యే స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో తన అందాలను మరింత ఎలివేట్ చేసింది. ముఖ్యంగా ఆమె ఫ్రంట్ అండ్ బ్యాక్ గ్లామర్ అందాలు అభిమానుల చూపును కట్టిపడేస్తున్నాయి. ముఖంపైకి మెల్లగా జారిన కురులు ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకురాగా, చెవులకు ధరించిన స్టైలిష్ ఇయర్‌రింగ్స్ స్పెషల్ హైలైట్‌గా నిలిచాయి. మొత్తంగా ఈ ఫోటోల్లో శర్వరి తన అందం, స్టైల్‌తో నెటిజన్లను ఫిదా చేస్తుండగా, ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



# 'రామాయణ' లో నా పాత్ర నిడివి కూడా తక్కువ

బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ప్రతిష్మాత్మక చిత్రం 'రామాయణ'. నితీష్ తివారీ దర్శకత్వంలో రాబోతుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా రెండు భాగాలుగా రాబోతోంది. అయితే ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ రావణాసుడురి భార్య మండోదరి పాత్రలో కనిపించబోతున్నారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజల్ తన పాత్ర నిడివి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాము ఇప్పటివరకు రామాయణ మొదటి భాగానికి సంబంధించిన షూటింగ్‌ను మాత్రమే పూర్తి చేశామని కాజల్ వెల్లడించారు. ఈ సినిమాలో తన మండోదరి పాత్రకు సంబంధించిన లంక సన్నివేశాలు చాలా తక్కువగా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. కథ ప్రకారం మొదటి భాగంలో లంకకు సంబంధించిన సీన్లు తక్కువగా ఉండటం వల్ల, సహజంగానే తన పాత్ర నిడివి కూడా తక్కువగానే ఉంటుందని కాజల్ చెప్పారు. స్క్రీన్ టైమ్ తక్కువగా ఉన్నప్పటికీ, ఇంతటి భారీ మరియు ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లో భాగం కావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమాలో రావణాసురుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఒక గొప్ప అనుభవమని కాజల్ కొనియాడారు. యష్ అద్భుతమైన నటుడని, ఈ సినిమా కోసం ఆయన ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. తన వృత్తి పట్ల యష్‌కు ఉన్న నిబద్ధత, క్రమశిక్షణ చూసి ముచ్చటేసిందని కాజల్ ఈ సందర్భంగా ప్రశంసలు కురిపించారు.



# పవర్‌ఫుల్ మాస్ పాత్రలో రష్మిక

తెలుగు సినిమా పరిశ్రమలో అత్యంత వేగంగా స్టార్ హీరోయిన్‌గా ఎదిగి, ఆ తర్వాత కూడా అదే జోరును కొనసాగిస్తూ కెరీర్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న అతికొద్ది మంది హీరోయిన్లలో రష్మిక మందన్న ఒకరు. సాధారణంగా స్టార్ హీరోయిన్ హోదా వచ్చిన తర్వాత చాలామంది నటీమణులు కమర్షియల్ సినిమాలతో పాటు తమ నటనకు గుర్తింపు తెచ్చుకునేందుకు లేడీ ఓరియెంటెడ్ చిత్రాల వైపు అడుగులు వేస్తుంటారు. తెలుగు సినీ పరిశ్రమలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో పలువురు విజయాలు సాధించినప్పటికీ, మాస్ యాక్షన్ కథల్లోనూ ప్రేక్షకులను మెప్పించిన వారు మాత్రం చాలా తక్కువ. అలాంటి వారిలో విజయశాంతి, అనుష్క, తాజాగా సమంత పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. ఇప్పుడు అదే దారిలో రష్మిక కూడా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఆమె 'మైసా' చిత్రంలో పవర్‌ఫుల్ మాస్ పాత్రలో కనిపించబోతోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలను బట్టి చూస్తే, ఈ సినిమాలో రష్మిక పాత్ర ఎంతో ప్రభావవంతంగా, యాక్షన్ ప్రధానంగా ఉండబోతుందని స్పష్టంగా తెలుస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధిస్తే రష్మిక కెరీర్ మరో స్థాయికి చేరుకుంటుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే హీరోయిన్‌గా ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. మరి 'మైసా'తో రష్మిక ఆ స్థాయి విజయాన్ని అందుకుంటుందా? విజయశాంతి, అనుష్క, సమంతల తరహాలో మాస్ ప్రేక్షకులను మెప్పించగలదా? అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com